ప్రజాశక్తి
సోమవారం 12 మే, 2025
5
శ్రీకాకుళం

నేడు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

ప్రజాశక్తి - శ్రీకాకుళం

ప్రజా ఫిర్యాదుల నమోదు, పరిష్కార వేదికను జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఒక ప్రకటనలో తెలిపారు. అర్జీదారులు వారి అర్జీలను Meekosam.ap.gov.in వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవచ్చని పేర్కొన్నారు. అర్జీదారుల అర్జీల నమోదు, వాటి స్థితి, అందుకు సంబంధించిన సమాచారం తెలుసుకోవాలంటే 1100 నంబరుకు కాల్ చేయవచ్చని తెలిపారు. ప్రజా ఫిర్యాదుల నమోదు, పరిష్కార వేదికను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఉత్తేజితం శ్రీ శూద్ర గంగ కావ్య గానం

- ఆలపించిన కవి, జాతీయ ఉత్తమ సినీ రచయిత డా. సుద్దాల అశోక్ తేజ
- మంత్రముగ్ధులైన సభికులు

కవి, జాతీయ ఉత్తమ సినీ రచయిత డా.సుద్దాల అశోక్ తేజ ఆలపించిన శ్రీ శూద్ర గంగ కావ్య ఆద్యంతం సభికులను ఉత్తేజపరిచింది. శ్రీకాకుళం నగరంలోని స్థానిక బాపూజీ కళామందిర్‌లో సాహితీ స్రవంతి, శ్రీకాకుళ సాహితీ సంయుక్తంగా నిర్వహించిన శ్రీ శూద్రగంగ 'కావ్య గాన సభ' లో గానాన్ని ఆలపించారు. గంగ ప్రవాహంలా సాగిన ఆయన కావ్య గానం అందరి మనస్సులను రంజింప చేసింది. కావ్య గానం ప్రారంభిస్తూ డా. సుద్దాల అశోక్ తేజ ఒక వేళ బ్రహ్మపాదాల నుంచి తన మూల పురుషుడు పుట్టినట్లయితే తానూ కూడా పాదాల నుంచి పుట్టినవాడని, తానూ శూద్రుడని ఒప్పుకుంటూ గిరుల్లోనే ఉంటూనే, ఆ గిరిగీసిన చక్రబంధనాన్ని బదాబదనం చేసేందుకే ఈ కావ్యం రాశానని చెప్పారు. ఈ స్పృహ తనకు 30 ఏళ్ల కిందటే ఉంటే సుద్దాల అశోక్ శూద్ర తేజ అని పేరు పెట్టుకునేవాడినని చెప్పారు.

ప్రజాశక్తి- శ్రీకాకుళం ప్రతినిధి

అనంతరం తన కావ్యాన్ని ఆలపించారు. ఎవరో తపస్సు చేస్తే గంగ నేలకు దిగి రాలేదని, తానే భూమి మీదకు రావాలని కోరుకున్నదని కావ్యంలో చెప్పుకొచ్చారు. గంగ విష్ణుమూర్తి పాదాల నుంచి పుట్టిందని, పురాణాలు, శూద్రులు బ్రహ్మ పాదాల నుంచే పుట్టారని హిందూ ధర్మం చెప్తోందని, కావున ఇద్దరూ ఒకే పాదాల నుంచే పుట్టారంటూ ఒక నూతన పోలికను కావ్యంలో పొందుపరిచారు. వివిధ చేతి వృత్తులు చేస్తూ బతికే జాతులన్నీ తన కుటుంబ సభ్యులేనన్న సత్యాన్ని గ్రహించిన గంగ తన తోబుట్టువులైన శూద్రులతో మమేకం కావాలనుకుంటోందన్నారు. వినువీధికి వీడ్కోలు మన వీధికి వస్తున్నదని చెప్తూ చెమట చుక్కలేని కన్నీటి చుక్కరాని చుక్కల లోకం లోకాల నుంచి చెక్కేస్తున్నదంటూ డా. సుద్దాల అశోక్ తేజ చేసిన గాన ప్రవాహానికి అంతా హర్షధ్వనాలు పలికారు. కైలాసమున పరిస్థితులను సరిపోల్చుతూ అసమానతలు, దొరల దోపిడీని కళ్లకు కట్టినట్లు వివరించారు. శివుడి మెడలో పాము ఉన్నా పదవీ అహంకారం లేని కోరలేని దొరలుగా ఉందంటూ వర్ణించారు. తనను మింగే పాము చెంతనుండగా మీసాలు కొసలు మెరుపులను ఎలుకు చూపించిదంటూ



అశోక్ తేజను సన్మానిస్తున్న సాహితీవేత్తలు, ప్రజాసంఘాల నాయకులు

ఆలపించారు. నెమలితో ప్రమాదం లేని పాములను చూసి వారెవ ఈ లోకము అని గంగమ్మ అనుకున్నదన్నారు. శంకరుని దగ్గర ఉన్న ఎద్దును కనీసం గోరుతో గీకలేని పులిని గంగమ్మ చూసిందన్నారు. ఎలుక పీడిత ప్రాణి అని ఎలుకను పీడించే పాము బుస్సు అంటూ భూస్వామివర్గం నైజాన్ని వర్ణించిన తీరు సభికులతో హర్షధ్వనాలను పలికించింది. పాములను పొడిచి తినే నెమలి పరాన్న జీవి అని దుక్కిటెద్దు కష్టజీవి వర్గమని అభివర్ణించారు. ప్రమథులది వంది మాగధుల వర్గమంటూ సకల వర్గాలను సమన్వయ పరిచి సమాన అవకాశాలు ఇచ్చిందంటూ పోలిక తెచ్చారు. సమాన అవకాశాలు ఇచ్చి సమదృష్టి సారించి పాలించే కైలాసం సాక్షాత్తూ మరో ప్రపంచమని అన్నారు. ఇటువంటి ఎన్నో సామాజిక స్థితిగతుల మీద తన దైన శైలిలో తన శ్రీశూద్ర గంగ కావ్యంలో ఆలపించారు.

సాహిత్యానికి వారసుడు కావడం అరుదు : అట్టాడ

ప్రముఖ కవి, రచయిత అట్టాడ అప్పలనాయుడు కావ్యాన్ని పరిచయం చేస్తూ ప్రకృతిని, శ్రమను, శూద్రులను మేళవించి రాయగలిగిన ఏకైన సినీ రచయిత డా. సుద్దాల అశోక్ తేజ అని అన్నారు. ఆస్తులకు ఎవరైనా వారసులు కావొచ్చుగాని సాహిత్యానికి వారసుడు కావడం చాలా అరుదైన విషయం మని, తన తండ్రి సుద్దాల హనుమంతు నుంచి సాహిత్య వారసత్వాన్ని పొందారని ప్రశంసించారు. మతం ప్రజలను విడగొడుతుందని, సాహిత్యం ప్రజలకు కలుపుతుందన్నారు. శ్రీ శూద్ర గంగ కావ్యం గంగలో మునుగుతున్నట్లు, తేలియాడుతున్నట్టు ఉంటుందన్నారు. సంఘ పరివార్ సృష్టించిన పుక్కిట పురాణాలను ఆయన చీల్చి చెండాడారన్నారు. కవి కంచరాన భుజంగరావు, డా.బి.ఆర్ అంబేద్కర్ యూనివర్సిటీ తెలుగు అధ్యాపకులు డా. కె.ఉదయ్ కిరణ్ తమ ప్రతిస్పందనలను వినిపించారు.

కుల వ్యవస్థ దురంహకారాన్ని స్పృశించింది : శ్రీనివాసు

సభకు అధ్యక్షత వహించిన సాహితీ స్రవంతి కేతవరపు శ్రీనివాసు మాట్లాడుతూ సాహితీ ప్రపంచాన్ని డా.సుద్దాల అశోక్ తేజ కొత్త పుంతలు తొక్కించారన్నారు. కుల వ్యవస్థ, దాని దురహంకారాన్ని ఈ కావ్యం స్పృశించిందన్నారు. ఈ సందర్భంగా సాహితీ వేత్తలు, ప్రజా సంఘాల ప్రతినిధులు, అభిమానులు ఆయనను ఘనంగా సత్కరించారు. అంతకు ముందు పెహల్గాం మృతులకు, ఇటీవల పాకిస్థాన్ దాడుల్లో మృతి చెందిన వారికి సభలో రెండు నిమిషాలు మౌనం పాటించి శ్రద్ధాంజలి ఘటించారు. ప్రజా కళాకారులు దేవిశ్రీ, చింతాడ రామచంద్రరావు, శ్రీనివాసులు పలు అభ్యుదయ గీతాలను ఆలపించారు. కార్యక్రమంలో బాడాన శ్యామలరావు, నట్టిమి రమణారావు, పూజారి దివాకర్, డాక్టర్ కురసాల శ్రీనువాసరావు, పి.మోహనరావు తదితరులు పాల్గొన్నారు.

హాజరైన అభిమానులు

అఖిల భారత సమ్మెను
జయప్రదం చేయాలి

కార్మిక, ప్రజా, ఉద్యోగ సంఘాల సదస్సు పిలుపు

ప్రజాశక్తి - శ్రీకాకుళం

కార్మిక హక్కులను కాలరాసే లేబర్ కోడ్‌లు రద్దు చేయాలని, కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, ప్రభుత్వరంగ సంస్థల పరిరక్షణకు కేంద్ర కార్మిక సంఘాల పిలుపు మేరకు ఈనెల 20న చేపట్టే అఖిల భారత సమ్మెను జయప్రదం చేయాలని కార్మిక, ప్రజా, ఉద్యోగ సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. అఖిల భారత సమ్మె జయప్రదానికి సన్నాహకంగా 'లేబర్ కోడ్లు- కార్మిక హక్కులపై దాడి' అనే అంశంపై కార్మిక, ఉద్యోగ సంఘాల ఆధ్వర్యాన నగరంలోని యుటిఎఫ్ జిల్లా కార్యాలయంలో ఆదివారం సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఐదేళ్లకు సవరించాల్సిన కనీస వేతనాలు 20 ఏళ్లుగా సవరించకపోవడంతో, కార్మికులు వేల కోట్ల రూపాయలు నష్టపోతున్నారని తెలిపారు. ధరలు విపరీతంగా పెరిగిన నేపథ్యంలో కనీస వేతనం నెలకు రూ.26 వేలుగా నిర్ణయించి అమలు చేయాలని, కనీస పెన్షన్ రూ.తొమ్మిది ఇవ్వాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్టు కార్మికులు, అంగన్వాడీ, ఆశ, మధ్యాహ్నం భోజన పథకం తదితర స్కీమ్ వర్కర్లను రెగ్యులర్ చేయాలని, పనిభారం తగ్గించాలని డిమాండ్ చేశారు. బ్రిటిష్ కాలం నుంచి పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను మోడీ నాయకత్వంలోని బిజెపి ప్రభుత్వం పెట్టుబడిదారీ ప్రయోజనాల కోసం నాలుగు లేబర్ కోడ్‌లుగా మార్చివేసిందని విమర్శించారు. కార్మిక సంఘాలను బలహీనం చేసి యాజమాన్యాల శ్రమ దోపిడీని మరింత పెంచుకోవడం కోసం, యజమానుల దోపిడీని, అక్రమ తొలగింపులను, పనిభారాన్ని ప్రశ్నించే పరిస్థితి లేకుండా చేయడం కోసం కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్‌లను తెచ్చిందన్నారు. పని గంటలు పెంచడానికి, యజమానులు తమ ఇష్టానుసారంగా వ్యవహరించేలా, పెట్టుబడిదారులకు ఉద్యోగులను, కార్మికులను ఆధునిక బానిసలుగా మార్చే విధంగా ఈ లేబర్ కోడ్‌లు ఉన్నాయన్నారు. ప్రజాధనంతో నిర్మించుకున్న విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్, ప్రభుత్వరంగ పరిశ్రమలు, రైల్వేలు, బ్యాంకులు, ఎల్ఐసి, రక్షణ రంగం, గనులు, ప్రకృతి వనరులను కార్పొరేట్ సంస్థలకు అప్పగించేందుకు ప్రైవేటీకరణను వేగవంతంగా అమలు చేస్తున్నారని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం అదానీ, అంబానీలకు దేశ సంపదను దోచిపెడుతూ కార్పొరేట్ అనుకూల విధానాలు అవలంభిస్తూ కార్మిక, కర్షకులకు ద్రోహం చేస్తోందని, ప్రజలపై భారాలు వేస్తోందని విమర్శించారు. సమాజంలో మత వైషమ్యాలు పెంచి మత చీలికలు తెస్తోందని తెలిపారు. అఖిల భారత సమ్మెను జయప్రదం చేసి కేంద్ర ప్రభుత్వానికి హెచ్చరిక చేయాలని కోరారు. సదస్సులో సిఐటియు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సిహెచ్.అమ్మన్నాయుడు, పి.తేజేశ్వరరావు, ఎఐటియుసి జిల్లా గౌరవ సలహాదారు చిక్కాల.గోవిందరావు, ఐఎఫ్‌టియు జిల్లా నాయకులు ఎస్.కృష్ణవేణి, వైఎస్ఆర్ మేధావుల ఫోరం నాయకులు ఎస్.వెంకటరావు, శ్రామిక మహిళల సమన్వయ కమిటీ కన్వీనర్ కె.నాగమణి, పెన్షనర్స్ యూనియన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు డి.పార్వతీశం, ఎం.ఆదినారాయణమూర్తి, ఎల్ఐసి ఉద్యోగుల సంఘం నాయకులు టి.ఆచారి, ఎస్ఎన్ఎల్ పి.వెంకటరావు, ఆలిండియా బ్యాంకు ఎంప్లాయీస్ అసోసియేషన్ నాయకులు బి.శ్రీనివాసులు, రైతు సంఘం నాయకులు కొత్తకోట అప్పారావు, ఆశా వర్కర్స్ యూనియన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు డి.ధనలక్ష్మి, జి.అమరావతి, విఎఎల సంఘం జిల్లా గౌరవాధ్యక్షులు అల్లు మహాలక్ష్మి, సాహితీ స్రవంతి జిల్లా అధ్యక్షులు కె.శ్రీనివాసు, పలు సంఘాల నాయకులు పాల్గొన్నారు.

పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కార్మిక, ప్రజా, ఉద్యోగ సంఘాల నాయకులు

బూర్జ : బస్సులో తనిఖీలు చేస్తున్న పోలీసులు

పోలీసుల విస్తృత తనిఖీలు

శ్రీకాకుళం: జిల్లావ్యాప్తంగా రైల్వే, బస్‌స్టేషన్లలో పోలీసులు ఆదివారం ముమ్మర తనిఖీలు చేపట్టారు. దేశ సరిహద్దులో నెలకొన్న ఉద్రిక్త వాతావరణం నేపథ్యంలో ఎస్‌పి కె.వి మహేశ్వర రెడ్డి ఆదేశాల మేరకు ఆదివారం సాయంత్రం నాలుగు నుంచి ఆరు గంటల మధ్యకాలంలో ఆకస్మికంగా తనిఖీలు చేపట్టారు. జిల్లాలోని ముఖ్యమైన పట్టణ కేంద్రాల్లో రైల్వే, బస్ స్టేషన్లు, రహదారి మార్గాల్లో తనిఖీలు నిర్వహించారు. గంజాయి వంటి మత్తు పదార్థాల అక్రమ రవాణా నియంత్రణ, పేలుడు పదార్థాల గుర్తింపు, కొత్త, అనుమానాస్పద వ్యక్తుల కదలికలపై తనిఖీలు సాగాయి. రైల్వే, బస్‌స్టేషన్లలో ప్రయాణికుల బ్యాగులను క్షుణ్ణంగా పరిశీలించారు. అన్ని సబ్ డివిజన్లలో డిఎస్‌పి స్థాయి పోలీస్ అధికారుల పర్యవేక్షణలో సిఐలు, ఎస్ఐలు పోలీసు సిబ్బందితో సమన్వయంతో తనిఖీలను నిర్వహించారు. ఎటువంటి ఆవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా, అనుమానాస్పద వ్యక్తుల కదలికలపై ప్రత్యేకంగా నిఘా ఉంచి ముందస్తు భద్రతా చర్యలు చేపడుతున్నట్లు ఎస్‌పి మహేశ్వర రెడ్డి తెలిపారు.

బకాయి వేతనం చెల్లించాలి

ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షులు నాగమణి

ప్రజాశక్తి - శ్రీకాకుళం

ఆశాలకు రాష్ట్ర ప్రభుత్వం తరుపున చెల్లించాల్సిన మార్చి బకాయి వేతనం రూ.7,200 వెంటనే చెల్లించాలని ఎపి ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షులు కె.నాగమణి, డి.ధనలక్ష్మి, జి.అమరావతి డిమాండ్ చేశారు. నగరంలోని సిఐటియు జిల్లా కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన ఆశా వర్కర్స్ యూనియన్ సమావేశంలో వారు మాట్లాడారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో మార్చి నెల పూర్తి వేతనం చెల్లించినా, జిల్లాలో మాత్రం అధికారుల జాప్యం వల్ల జీతం రాలేదన్నారు. పదే పదే అధికారులను అడుగుతుంటే బ్యాంకు ఖాతాల్లో బకాయి వేతనం జమవుతుందని చెప్తున్నారని, ఇంతవరకు చెల్లించలేదని తెలిపారు. ఆశాలకు రికార్డులు అవసరం లేదని, మొబైల్ యాప్‌లో పనిచేయాలని రాష్ట్ర అధికారులు ఆదేశాలు ఇస్తే జిల్లాలో రికార్డు పని, ఆన్‌లైన్ పని రెండూ చేయిస్తూ పనిభారం పెంచుతున్నారని చెప్పారు. యాప్‌ల్లో ఆన్‌లైన్ పని కష్టతరంగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. లేబర్ కోడ్‌ల రద్దు, కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని కోరుతూ కార్మిక సంఘాల పిలుపుమేరకు మే 20న చేపట్టే దేశవ్యాప్త సమ్మెను ఆశాలంతా జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఆ రోజు మండల కేంద్రాల్లో నిర్వహించే ప్రదర్శన, సభల్లో పాల్గొనాలన్నారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం వైద్య రంగానికి సరిపడా నిధులు కేటాయించడం లేదని విమర్శించారు. ఆరోగ్య రంగానికి జిడిపిలో 6 శాతం, కేంద్ర బడ్జెట్‌లో 10 శాతం నిధులు కేటాయించాలని కోరారు. ఆశాలను కార్మికులుగా గుర్తించి, కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కమ్యూనిటీ హెల్త్ వర్కర్స్‌ను ఆశాలుగా మార్పు చేయాలని, ఒప్పంద జిఒలు విడుదల చేయాలని, చట్టబద్ధమైన సౌకర్యాలు కల్పించాలనే డిమాండ్ చేశారు. 20 ఏళ్లుగా పేద ప్రజలకు ఆరోగ్య సేవలందిస్తున్నారని చెప్పారు. విధినిర్వహణలో ప్రమాదవశాత్తు, అనారోగ్యంతో ఆశావర్కర్లు అర్ధాంతరంగా చనిపోతున్నారని తెలిపారు. ప్రభుత్వం ఆశావర్కర్లకు గ్రూప్ ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. ఏజెన్సీలో పనిచేస్తున్న కమ్యూనిటీ హెల్త్ వర్కర్స్‌ను ఆశాలుగా మార్పు చేయాలన్నారు. ప్రభుత్వరంగ సంస్థల ప్రైవేటీకరణ, అమ్మకాన్ని ఆపాలని, ప్రజా సంపదను కాపాడాలని కోరారు.

మాట్లాడుతున్న నాగమణి

మొక్కలతోనే వాతావరణ సమతుల్యత

ప్రజాశక్తి - శ్రీకాకుళం

వాతావరణ సమతుల్యతకు మొక్కలు నాటాలని జిల్లా పోర్టుఫోలియో జడ్జి సత్తి సుబ్బారెడ్డి అన్నారు. జిల్లా పర్యటనకు వచ్చిన ఆయన ఆదివారం జిల్లా కోర్టులోని బార్ అసోసియేషన్ ప్రాంగణంలో జిల్లా జడ్జి జునైద్ అహ్మద్ మౌలానాతో కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఒకటో అదనపు జిల్లా జడ్జి భాస్కరరావు, మూడో అదనపు జిల్లా జడ్జి వివేకానంద శ్రీనివాస్, నాలుగో అదనపు జిల్లా జడ్జి ఫణికుమార్, బార్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు తంగి శివప్రసాదరావు, ప్రధాన కార్యదర్శి పిట్టా దామోదరరావు, స్టేట్ బార్ సభ్యులు గేదెల వాసుదేవరావు, పలువురు న్యాయమూర్తులు, సీనియర్, జూనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

మొక్కను నాటుతున్న సుబ్బారెడ్డి

మాక్ డిఎస్‌సికి స్పందన

ప్రజాశక్తి- శ్రీకాకుళం

కేంద్ర పౌర విమానశాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు తన తండ్రి కీర్తిశేషులు ఎర్రన్నాయుడి పేరుతో ర్రన్న విద్యా సంకల్పంలో భాగంగా ఆదివారం మాక్ డిఎస్‌సి నిర్వహించారు. ఎచ్చెర్ల మండలం శివానీ ఇంజినీరింగ్, టెక్కలి ఐతం ఇంజినీరింగ్ కళాశాలల కేంద్రాల్లో కంప్యూటర్ ఆధారిత పరీక్ష విధానంలో మాక్ పరీక్ష నిర్వహించారు. అభ్యర్థులకు ప్రధాన పరీక్షల ముందు విశిష్ట అనుభవాన్ని పొందడానికి ఈ పరీక్ష తోడ్పడుతోందని భావించారు. సుమారు 300 మంది అభ్యర్థులు ఈ పరీక్షకు హాజరయ్యారు.

మాక్ డిఎస్‌సి పరీక్ష రాస్తున్న అభ్యర్థులు

చెరువులో చేపలు పడుతున్న గ్రామస్తులు

చేపల వేట సందడి

ఆమదాలవలస : మండలంలోని లొద్దలపేటలో సూరప్ప చెరువులో చేపల వేట కోసం గ్రామస్తులంతా కదిలారు. వేసవి కావడంతో సూరప్ప చెరువులోని నీరు తగ్గడంతో ఆదివారం ఉదయం గ్రామస్తులంతా మూకుమ్మడిగా చేపల వేట ప్రారంభించారు. కొంత మందికి పెద్ద పెద్ద చేపలు దొరకడంతో ఆనందంగా ఇంటికి వెళ్లారు. మరి కొంత మందికి చేపలు వలల్లో పడకపోవడంతో నిరాశతో ఇంటికి వెనుదిరిగారు. ఏటా మే నెలలో ఇదే విధంగా మూకుమ్మడిగా చేపల కోసం ఒకేసారి గ్రామస్తులంతా చెరువులో దిగడం ఆనవాయితీగా వస్తుందని గ్రామస్తులు తెలిపారు.

'మే' పుష్ప వికాసం

ప్రకృతి సిద్ధంగా ఒక్కో పుష్పానికి ఒక్కో గుణం ఉంటుంది. సోయగాలను అందించే ఈ పుష్పాలు అతి తక్కువ కాలమే. శ్రీకాకుళం నగరంలోని బ్యాంకర్స్ కాలనీలో శనివారం కనిపించిన మే పుష్పం మాత్రం ఏడాదికి ఒక్కసారే కనిపిస్తుంది. అందులో మే నెలలోనే మొక్కగా మొదలైన పుష్పం శనివారం వికసించింది. సుమారు పదిహేనే రోజుల పాటు ఇదే వికాసంతో ఉండే ఈ పుష్పం మే చివరి వారంలో వాడిపోతుందని ఇంటి యజమాని పార్వతి చెబుతుంది.

\- ప్రజాశక్తి, శ్రీకాకుళం

'మే' పుష్పం

ఐటిఐ విద్యార్థులకు అవకాశాలు మెండు

- కంపెనీల్లో పెరుగుతున్న ఉద్యోగ నియామకాలు
- ఫీల్డ్ వర్కర్లుగా ఉపాధి పొందడానికి వీలు
- రాష్ట్ర, రాష్ట్రేతర కంపెనీల్లో కొలువులు
- ఐటిఐల జిల్లా కో-ఆర్డినేటర్ రామ్మోహనరావు

ప్రజాశక్తి- శ్రీకాకుళం

సాంకేతిక రంగాల్లో ఉపాధి అవకాశాలు పెరుగుతున్నాయని, ఐటిఐ చదవుకున్న విద్యార్థులను వివిధ కంపెనీల్లో ఉద్యోగాలు పొందేందుకు అనువైన పరిస్థితి ఉందని ఐటిఐ జిల్లా కో-ఆర్డినేటర్ ఎండ రామ్మోహనరావు తెలిపారు. రాష్ట్ర, రాష్ట్రేతర కంపెనీలు ఐటిఐ చదవుతున్న వారికి ఉద్యోగావకాశాలు కల్పించడానికి ఆసక్తి చూపుతున్నారని అన్నారు. ఐటిఐ చదువుకున్న విద్యార్థులు నైపుణ్యాభివృద్ధి శిక్షణ పూర్తి చేసుకుంటే అటువంటి వారికి అనేక రకాలైన అవకాశాలున్నాయని పేర్కొన్నారు. శిక్షణ ఇచ్చి ఉపాధి అవకాశాలు కల్పిస్తుండడం వల్ల గతేడాది ప్రవేశాలు గణనీయంగా పెరిగాయన్నారు. గతేడాది రాష్ట్రంలో అత్యధికంగా జిల్లాలో 93 శాతం ప్రవేశాలు జరిగాయని అన్నారు. ఈ ఏడాదీ విద్యార్థుల్లో ఆసక్తి పెరిగిందని వివరించారు. ప్రధానంగా పిట్టర్, ఎలక్ట్రీషియన్, మెకానికల్, ఎలక్ట్రానిక్స్ వంటి ట్రేడుల్లో చేరేందుకు విద్యార్థులు ఆసక్తి కనబరుస్తున్నారు. ఐటిఐ ప్రాధాన్యతను దృష్టిలో ఉంచుకుని జిల్లాలో చేపడుతున్న వివిధ అంశాలపై ముఖాముఖిలో భాగంగా 'ప్రజాశక్తి'కి వివరించారు.

? ఇంటెర్న్‌షిప్ ఐటిఐ విద్యార్థులకు ఎంత మేరకు ఉపకరిస్తుంది?

ఇన్‌ప్లాంటు శిక్షణ పేరుతో వివిధ కంపెనీలు ఐటిఐ చదవుతున్న విద్యార్థుల్లో ఆసక్తిని పెంచడానికి అభ్యర్థులకు శిక్షణ ఇస్తున్నాయి. 3 నుంచి 6 నెలల పాటు శిక్షణ ఇచ్చి కంపెనీల్లో అనంతరం ఉపాధి కల్పిస్తున్నారు. ఇంటర్న్‌షిప్ తప్పనిసరి చేయడంతో విద్యార్థుల్లో ఆసక్తి పెరుగుతోంది. శిక్షణ పొందడం వల్ల వారికి ప్రయోజనం కలుగుతోంది. జిల్లాలోని ప్రభుత్వ, ప్రయివేటు ఐటిఐల నుంచి వివిధ ప్రాంతాల్లో ఇన్‌ప్లాంటు శిక్షణ పొందుతున్నారు. శ్రీసిటీ, సూళ్లూరుపేట, హైదరాబాద్, విశాఖపట్నం ప్రాంతాల్లో ఈ శిక్షణ ఉంటోంది. శిక్షణ సమయంలో నెలకు రూ.12 వేల వరకు ఆయా కంపెనీలు చెల్లిస్తున్నాయి. శిక్షణ పూర్తయిన తర్వాత అభ్యర్థుల ఆసక్తిని బట్టి ఉద్యోగాలు కల్పిస్తున్నారు. జిల్లా నుంచి అత్యధికంగా శ్రీసిటీలో ఉపాధి పొందుతున్నవారు వందల సంఖ్యలో ఉన్నారు. గతేడాది జిల్లా నుంచి పెద్దఎత్తున క్యాంపస్ ఎంపికల ద్వారా వివిధ కంపెనీల్లో ఉద్యోగాలు పొందగలిగారు.

? ఏయే కోర్సుల ద్వారా అధిక శాతం మందికి ఉపాధి లభిస్తోంది?

జిల్లాలో ఫెర్రో, ఫార్మా రంగాలను లీడ్ సెక్టార్లుగా ప్రభుత్వం గుర్తించింది. ఆయా రంగాలకు సంబంధించి స్వల్పకాలికంగా అదనపు కోర్సులను ఇప్పటికే రూపొందించారు. వీటిపై మూడు నెలల పాటు శిక్షణ ఇస్తున్నాం. జిల్లాలోని పలు ప్రభుత్వ ఐటిఐలను వాటికి అనుసంధానం చేశాం. అలాగే మహిళలకు కుట్టు శిక్షణ, చేనేత పరిశ్రమలు, డైమండ్ కటింగ్ పాలిషింగ్ వంటి రంగాల్లో అవకాశాలున్నాయి. దీన్ని ఉపయోగించుకునేలా విద్యార్థినులకు ప్రత్యేక కోర్సులను నిర్వహించి ఉపాధి అవకాశాలు మెరుగుపరిచాం. ఈ అవకాశాలను మహిళలు సద్వినియోగం చేసుకుంటూ కొందరు స్వయం ఉపాధి పొందుతుంటే.. మరి కొందరు వివిధ కంపెనీల్లో ఉద్యోగాల్లో చేరి ఉపాధి పొందుతున్నారు.





? బయోమెట్రిక్ హాజరు అమలు ఎలా సాగుతోంది?

జిల్లాలో బయోమెట్రిక్ హాజరు తప్పనిసరి అమలు చేస్తున్నాం. ప్రయివేటు ప్రభుత్వ ఐటిఐల్లోనూ ఈ విధానాన్ని అమలు చేస్తున్నాం. ప్రభుత్వ ఆదేశాలను అనుసరించి నిబంధనలకు లోబడి ఈ విధానం అమలు చేస్తున్నాం. 2025-26 విద్యా సంవత్సరానికి దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ ప్రారంభమైంది. ఈనెల 24లోగా ఆన్‌లైన్‌లో అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలి. 25, 26వ తేదీల్లో సమీపంలోని ప్రభుత్వ ఐటిఐలో ధ్రువపత్రాల పరిశీలన ఉంటుంది. అక్కడే మార్కుల ఆధారంగా సీట్లు కేటాయిస్తాం. విద్యార్థులకు బయోమెట్రిక్ యాజమాన్యాలదే పూర్తి బాధ్యతగా దీన్ని అమలు చేస్తున్నాం. ఐటిఐల్లో చేరిన విద్యార్థులు తరగతులకు హాజరు కాకుండా గైర్హాజరు కావడాన్ని విద్యాశాఖ తీవ్రంగా పరిగణిస్తూ ఈ విధానాన్ని అమలు చేస్తోంది.

? ఏయే కోర్సులు అందుబాటులో ఉన్నాయి?

ఐటిఐల్లో ఏడాది, రెండేళ్ల కోర్సులు అందుబాటులో ఉన్నాయి. రెండేళ్ల పాటు చదువుకునేందుకు ఎలక్ట్రీషియన్, ఫిట్టరు, డ్రాఫ్టుమెన్ సివిల్, మెకానికల్, డీజల్ మెకానికల్, టర్నర్, మిషనిస్టు కోర్సులు ఉన్నాయి. విదేశాల్లో ఉపాధి పొందడానికి సిమెన్లుగా స్థిరపడడానికి రైల్వేలో ఉద్యోగాలు పొందడానికి అనువైన ఈ కోర్సులకు పెద్దఎత్తున డిమాండ్ ఉంది. ఏడాది కోర్సుల్లో కంప్యూటర్, డిజల్ మెకానిక్, డ్రస్ మేకింగ్, వెల్డరు, కార్పెంటరు కోర్సులు ఉన్నాయి. డ్రస్‌మేకింగ్ అండ్ టైలరింగ్ కోర్సునకు విద్యార్థినులు మాత్రమే అర్హులు. మిగిలిన వాటికి ఇరువురూ అర్హులే. అలాగే ఐటిఐ పూర్తి చేసిన వారు పాలిటెక్నిక్‌లో రెండో ఏడాది బ్రిడ్జి కోర్సులో ప్రవేశం పొందవచ్చు. అలాగే పాలిటెక్నిక్ పూర్తయిన తర్వాత బిటెక్ చేసేందుకు వీలుంది. ఏటా ఈ తరహాలో సీట్లు పొంది ఉన్నత చదువులతో ఉపాధి పొందుతున్న వారు ఉన్నారు.

? ప్రవేశాలు ఎప్పుడు పొందవచ్చు?

ఐటిఐల్లో వివిధ కోర్సుల్లో చేరేందుకు ఆసక్తి ఉన్న అభ్యర్థులు ఈనెల 24 నుంచి దరఖాస్తు చేసుకోవాలి. apgov.in ద్వారా దరకాస్తు చేసుకోవాలి. 26,27 తేదీల్లో జిల్లాస్థాయిలో ఉన్న ప్రభుత్వ ఐటిఐల్లో ధ్రువపత్రాలను తనిఖీ చేయించుకోవాలి. వెరిఫికేషన్ పూర్తయిన తర్వాత కౌన్సెలింగ్ షెడ్యూల్‌ను అభ్యర్థుల మొబైల్ నంబరుకు సమాచారం పంపిస్తాం. పదో తరగతిలో ఉత్తీర్ణతా శాతాన్ని బట్టి రిజర్వేషన్ రోస్టర్ పాయింట్ల ఆధారంగా సీట్లు కేటాయిస్తాం. కౌన్సెలింగ్ ఆధారంగా అడ్మిషన్లు సాగాలి.

గణేష్‌కు ఆర్థికసాయం అందజేస్తున్న యూనియన్ నాయకులు

శ్యాంపిస్టన్స్ కార్మికుల ఔదార్యం

ప్రజాశక్తి- ఎచ్చెర్ల

శ్యాంపిస్టన్స్ ప్లాంట్-3లో బ్రెయిన్ ఆపరేషన్ జరిగిన పుడ్రోతు గణేష్‌కు తోటి కార్మికులు, ఉద్యోగుల వద్ద నుంచి రూ.59, 500 వసూలు చేసి ఆదివారం అక్కివలసలో గణేష్ ఇంటి వద్దకు వెళ్లి యూనియన్ నాయకులు అందజేశారు. ఈ సందర్భంగా స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు ఎన్.వి.రమణ కార్మికులు పోరాటాల్లోనే కాదు తోటి కార్మికులను ఆదుకునేందుకు కూడా ముందుంటారని నిరూపించిన ప్లాంట్-3 కార్మికులకు అభినందనలు తెలియజేశారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు పి.దుర్గాప్రసాద్, పి. శ్రీనుబాబు, ఎం.సూర్యనారాయణ, పి.సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమణలు తొలగిస్తున్న ఎస్ఐ చిరంజీవి

ఫుట్‌పాత్ ఆక్రమణల తొలగింపు

ప్రజాశక్తి- రణస్థలం

నిత్యం పెరుగుతున్న రద్దీకి సరిపడే రహదారులు లేకపోవటం, ఉన్న రహదారులను దర్జాగా ఆక్రమించుకోవటంతో రహదారులపై రాకపోకలు సాగించాలంటే ప్రయాణికులు నానా ఇక్కట్లకు గురవుతున్నారు. ట్రాఫిక్ సమస్యను పరిష్కరించేందుకు జె.ఆర్.పురం ఎస్ఐ ఎస్.చిరంజీవి ఫుట్‌పాత్‌ల ఆక్రమణలపై ఉక్కుపాదం మోపుతున్నారు. మండల కేంద్రంలో 16వ నంబర్ జాతీయ రహదారికి ఇరువైపులా ఉన్న సర్వీస్ రోడ్డుపై కూరగాయలు, పండ్ల వ్యాపారులు ఆక్రమించి దుకాణాలు ఏర్పాటు చేసి ట్రాఫిక్ సమస్య సృష్టిస్తున్నారు. అలాగే రోడ్డుకు ఇరువైపులా ద్విచక్ర వాహనాలు ఎక్కడ పడితే అక్కడే పార్కింగ్ చేయడంతో ట్రాఫిక్ సమస్య పెరిగిపోయింది. ఆదివారం ఎస్ఐ చిరంజీవి తన సిబ్బందితో వచ్చి రోడ్డుపై ఆక్రమణలు తొలగించారు. ద్విచక్ర వాహనదారులు ఎక్కడపడితే అక్కడే పార్కింగ్ చేయడంతో ట్రాఫిక్ సమస్య తలెత్తుతుందని, రోడ్డుకు ఇరువైపుల పార్కింగ్ చేయవద్దని, ఒకవైపు మాత్రమే పార్కింగ్ చేయాలని సూచించారు.

వినతిపత్రం అందజేస్తున్న వైసిపి నాయకులు

కాలువలు శుభ్రం చేయాలి

ప్రజాశక్తి- పలాస

పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలోని సూదికొండ, శివాజీ నగర్, లేబర్ కాలనీ, రోటరీ నగర్ తదితర ప్రాంతాల్లో మురుగు కాలువల్లో చెత్తా చెదారం పేరుకుపోయిందని, దీనిని శుభ్రం చేయాలని వైసిపి పట్టణ అధ్యక్షులు శిష్టు గోపి కోరారు. ఈ మేరకు కమిషనర్ ఎన్.రామారావును ఆదివారం కలిసి వినతిపత్రం అందజేశారు. కాలువలు శుభ్రం చేయక పోవడంతో ఆయా ప్రాంత ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. పది రోజులుగా కాలువలు శుభ్రం చేయాలని పదే పదే చెబుతున్న మున్సిపల్ అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ప్లాస్టిక్ విపరీతంగా మున్సిపాలిటీలో వినియోగిస్తున్నారని, ప్లాస్టిక్ నిర్మూలనకు చర్యలు తీసుకోవాలని కోరారు. దీనిపై కమిసనర్ సానుకూలంగా స్పందించి కాలువలు శుభ్రం చేయిస్తామని హామీనిచ్చారు.

ప్రారంభిస్తున్న సిఐ చిన్నంనాయుడు

రోడ్డు భద్రత మిర్రర్ల ఏర్పాటు

ఇచ్ఛాపురం : ఇచ్ఛాపురం జెసిఐ సంస్థ ఆధ్వర్యాన ప్రజల రహదారి భద్రతను దృష్టిలో ఉంచుకుని మూడు ప్రధాన కూడళ్లలో మిర్రర్లను ఏర్పాటు చేశారని సిఐ చిన్నంనాయుడు అన్నారు. వీటిని ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జెసిఐ జట్టును అభినందిస్తూ... ఎంతో గొప్ప ప్రాజెక్టును అమలు చేశారని ప్రశంసించారు. ఈ మూడు రోడ్డు భద్ర మిర్రర్లు వెచ్చ రాము సరఫరా చేశారన్నారు. కార్యక్రమంలో జెసిఐ అధ్యక్షుడు కాళ్ల జైదేవ్, మొహన్, వెంకటేష్, పవన్, తంగుడు షణ్ముఖ, స్వరూప్, మట్ట శ్రీనివాస్, దిల్లేశు, రాజ్‌కమల్, మల్లి, సంతోష్, శ్యామ్, శ్రీను పాల్గొన్నారు.

దళిత విద్యార్థులకు సౌకర్యాలు కల్పించాలి

ప్రజాశక్తి- పలాస

డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ గురుకులాల్లో పేద దళిత విద్యార్థులకు విద్యా సౌకర్యాలు కల్పించాలని కులనిర్మూలనా పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షులు మిస్క కృష్ణయ్య కోరారు. పలాస రైల్వే ఇన్స్టిట్యూట్‌లో జిల్లా దళిత సంఘాల సంయుక్త మండలి అధ్వర్యాన ఆదివారం రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ఖాళీగా ఉన్న బోధన, బోధనేతర సిబ్బంది నియామకాలను నోటిఫికేషన్ విడుదల చేసి పోస్టులను భర్తీ చేయాలన్నారు. శిథిలావస్థలో ఉన్న భవనాలకు మరమ్మతులు చేపట్టాలన్నారు. దళిత మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి గురుకులాల్లో నెలకొని సమస్యను పరిష్కరించాలన్నారు. కాస్మోటిక్స్ ఛార్జీలు రద్దు చేయడం సరికాదన్నారు. కార్యక్రమంలో బెలమర ప్రభాకర్, పిడిఎస్‌యు రాష్ట్ర కార్యదర్శి వినోద్, డిహెచ్‌పిఎస్ జిల్లా కార్యదర్శి యాడ్ల గోపి, ధర్మారావు కళం గళం క్రియేషన్ నాయకులు కరుణాకర్, బి.దుర్యోధన, ఎన్జీవో నాయకులు బి.గోపాల్, సమత సైనికదల్ నాయకులు చల్లా రామారావు, గెజిటెడ్ అధికారుల సంఘం నాయకులు గోజ్జ నాగరాజు, ఆదివాసీ సంఘం నాయకులు వరహాల భాగ్యారావు, ఎస్‌సి వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు ఇప్పలి చంద్రవేఖర్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కృష్ణయ్య

తరలిపోతున్న మూగజీవాలు

- చోద్యం చూస్తున్న అధికారులు
- పాడి రైతులకు తప్పని అవస్థలు

పాలకొండ - శ్రీకాకుళం ప్రధాన రహదారిలో ఆటోలో తరలిస్తున్న పశువులు

ప్రజాశక్తి- బూర్జ

పాడి పశువులు కబేలాలకు తరలి పోతున్నాయి. ఈ మండలం నుంచి ప్రతిరోజు రాత్రి, పగలు తేడా లేకుండా పాడి పశువులను ఇతర ప్రాంతాలకు తరలించుకుపోతున్నారు. గతంలో బూర్జ మండలం కొల్లివలసతో పాటు పాలకొండ మండలంలోని నవగాం, ఇతర ప్రాంతాల్లో జరుగుతున్న సంతల్లో పాడి రైతులు తమకు కావాల్సిన ఆవులను, గేదెలను కొనుగోలు చేసే వారు. వీటిపైనే జీవనాధారం జరిగేది. అయితే తమ అవసరాల కోసం కొంత మంది రైతులు పాడి పశువులను సంతల్లో విక్రయించే వారు. దీనివలన పాడి పశువులు ఆ ప్రాంతాల నుంచి ఇంకొక ప్రాంతాలకు మాత్రమే తరలింపు జరిగేవి. ప్రస్తుతం పశువులను కొంతమంది దళారులు కొనుగోలు చేసి ఇతర దూర ప్రాంతాలకు కబేలాలకు యథేచ్ఛగా తరలిస్తున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒక రైతు నుంచి వేరొక రైతు దగ్గర పాడి పశువులు ఉంటే సంపద వృద్ధి చెందుతాయి. అయితే ప్రస్తుతం మూగ జీవాలను కొనుగోలు చేసి ఇతర రాష్ట్రాలకు ఎగుమతి చేస్తున్నారని రైతులు వాపోతున్నారు. మూగజీవాలను అక్రమంగా తరలిస్తే కఠినచర్యలు చేపట్టడం జరుగుతుందని అటు ప్రభుత్వం, ఇటు ఉన్నతాధికారులు ప్రకటనలు గుప్పిస్తున్నప్పటికీ ఆదిశగా చర్యలు తీసుకున్న దాఖలాలు కనిపించడం లేదు. ముఖ్యంగా సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడంతో ఈ ప్రాంతంలో అధిక సంఖ్యలో మూగజీవాలు తరలింపునకు గురవుతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు మూగజీవాలను ఎగుమతి చేస్తున్న వారిపై చర్యలు చేపట్టి తద్వారా పాడి పశువులను గ్రామాల్లోనే ఉండే విధంగా చర్యలు చేపట్టాలని మండల రైతులు కోరుతున్నారు.

తరలింపును అరికట్టాలి

అక్రమంగా మూగజీవాలను ఇతర ప్రాంతాలకు తరలిస్తున్న వారిపై చర్యలు చేపట్టి అక్రమ రవాణాలను అరికట్టాలి. ప్రభుత్వ అధికారులు, పాలకులు స్పందించి దళారులపై చర్యలు చేపట్టాలి.

- ఎస్.రాము, పాడి రైతు, బూర్జ

రైతులను ఆదుకోవాలి

ప్రభుత్వం నుంచి పాడి రైతులను ఆదుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ప్రభుత్వానికి రైతులపై చిన్నచూపు తగదు. పాడి రైతులకు జీవన విధానం మెరుగు పర్చేందుకు చర్యలు చేపట్టాలి.

- ఆదినారాయణ, పాడి రైతు, లాబాం

అరసవల్లి ఆదాయం రూ.12.38 లక్షలు

ప్రజాశక్తి- శ్రీకాకుళం

అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయంలో వైశాఖమాసం రెండో ఆదివారం కావడంతో యాత్రికుల రద్దీ పెరిగింది. దీంతో ఒక్కరోజున రూ.12.38 లక్షల మేర ఆదాయం సమకూరినట్టు ఆలయ ఇన్‌ఛార్జి ఇఒ శోభారాణి తెలిపారు. టెక్కెట్లు విక్రయాల ద్వారా రూ.8,50,600, విరాళాల రూపంలో రూ.1,63,869, ప్రసాదాల విక్రయాల ద్వారా రూ.2,23,580 ఆదాయం సమ కూరినట్టు ఆమె తెలిపారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

ప్రజాశక్తి- పొందూరు

పొందూరు మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపిడిఒ మీసాల మన్మథరావు తెలిపారు. ఈ సమావేశానికి ఎమ్మెల్యే కూన రవికుమార్ హాజరుకానున్నారన్నారు. ఉదయం 10 గంటలకు నిర్వహించే ఈ సమావేశానికి అధికారులు, ప్రజా ప్రతినిధులు హాజరుకావాలని ఆయన కోరారు.

అమరవీరులకు నివాళి

ఇచ్ఛాపురం : ఆపరేషన్ సిందూర పోరాటంలో వీర మరణం పొందిన భారత్ సైనికులకు ఘనంగ నివాళ్లర్పించారు. స్థానిక మాజీ సైనికులు సంక్షేమ సంఘం ఆధ్వర్యాన మాజీ సైనికులు సంక్షేమ సంఘ కార్యాలయంలో అమరవీరుల చిత్రపటాలకు ఆదివారం పూలమాలలు వేశారు. కార్యక్రమంలో బి ఎల్.నారాయణ, దక్కత విశ్వనాథ్, యు.శంకరరావు, డి.ఎస్.రెడ్డి, ఎస్.ఎన్.పట్నాయక్, టి.ఈశ్వరి, మదన్మోహన్ పాల్గొన్నారు.

ఇంటర్ విద్యార్థికి సన్మానం

ప్రజాశక్తి- పలాస

మండలంలోని గంగువాడకు చెందిన వట్టికూళ్ల ధనుంజయ కుమార్తె జ్యోతిక ఇటీవల ఇంటర్మీడియట్ ఫలితాల్లో 986 మార్కులు సాధించింది. ఈ మేరకు గ్రామ స్తులు ఆదివారం సన్మానించారు. దీంతో ప్రతిఒక్కరూ ఆనం దాలతో మురిసి పడుతున్నారు. డీలర్ పైల మాధవరావు, బాలరాజు, కృష్ణారావు, రామ్‌కుమార్ పాల్గొన్నారు.

'పది' విద్యార్థికి

పాతపట్నం : మండలంలోని రౌతులక్ష్మీపురానికి చెందిన డోల తేజేశ్వరరావు కుమారుడు డోల మనోహర్ రొంపివలస గ్రామ జిల్లా పరిషత్ పాఠశాలలో పదో తరగతి పరీక్షా ఫలితాల్లో 600 మార్కులకు గాను 593 మార్కులు సాధించారు. ఈ మేరకు తూర్పు కాపు మాజీ చైర్మన్, వైసిపి నాయకుడు మామిడి శ్రీకాంత్ ఆదివారం మనోహర్‌కు దుశ్శాలువ కప్పి సన్మానించారు. అనంతరం తల్లిదండ్రులకు అభినందించారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

సన్మానిస్తున్న విలేకరులు

శంకర్‌రెడ్డికి సన్మానం

ప్రజాశక్తి- నౌపడ

సంతబొమ్మాళి మండలం నౌపడకు చెందిన సీనియర్ పాత్రికేయుడు కర్రి శంకర్‌రెడ్డికి మండల పాత్రికేయులు ఆదివారం ఘనంగా సన్మానించారు. ఇటీవల జర్నలిస్టుల వెల్ఫేర్ సొసైటీ రాష్ట్ర అధ్యక్షుడిగా ఎన్నిక కావడంతో మండల పాత్రికేయులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మండల పరిషత్ కార్యాలయంలో దుశ్శాలువ కప్పి పుష్పగుచ్ఛం అందజేశారు. జర్నలిస్టులు ఐక్యతతో ముందుకు సాగాలని కోరారు. ప్రజా సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని చూచించారు. కార్యక్రమంలో మండల జర్నలిస్టుల అధ్యక్షుడు డి.గౌరీశంకర్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు సూరాడ జోగారావు తదితరులు పాల్గొన్నారు.

అరసవల్లిలో జనసేన నాయకులు

ఉగ్రవాదంపై ఉక్కుపాదం మోపాలి

ప్రజాశక్తి- శ్రీకాకుళం

దేశ రక్షణ కోసం పోరాడుతున్న సైనికుల్లో ఆత్మ స్థైర్యాన్ని నింపి విజయాన్ని కోరుతూ అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయంలో జనసేన ఆధ్వర్యాన హోమాన్ని నిర్వహించారు. పార్టీ జిల్లా అధ్యక్షులు పిసిని చంద్రమోహన్ ఆధ్వర్యాన చేపట్టిన ఈ కార్యక్రమంలో పాలకొండ ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ, సుడా చైర్మన్ కొరికాన రవికుమార్, తూర్పుకాపు కార్పొరేషన్ రాష్ట్ర చైర్‌పర్సన్ పాలవలస యశస్వి, డైరెక్టర్ గర్భాన సత్తిబాబు, జనసేన అసెంబ్లీ నియోజకవర్గాల సమన్వయకర్తలు డాక్టర్ విశ్వక్షేన్, దాసరి రాజు, కణితి కిరణ్ కుమార్, గేదెల చైతన్య, పొగిరి సురేష్ కుమార్, బలగ ప్రవీణ్, నిమ్మల నిబ్రం, ఉమ్మడి జనసేన జిల్లా ఉపాధ్యక్షులు భూపతి అర్జున్, జిల్లా ప్రధాన కార్యదర్శులు డాక్టర్ దానేటి శ్రీధర్, సంతోష్ పండా తదితరులు పాల్గొన్నారు.

దళితుల భూములను ఆక్రమిస్తే సహించం

నినాదాలు చేస్తున్న సింహాచలం, రైతులు

ప్రజాశక్తి- బూర్జ

దళితుల భూములను ఆక్రమించడానికి పూనుకోవడం సరికాదని, దళితుల కోసం పోరాటం చేస్తామని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గంగరాపు సింహాచలం అన్నారు. ఆదివారం మండలంలోని అన్నంపేటలో పెత్తందారులు ఆక్రమించిన భూములను పరిశీలించారు. తరతరాలుగా ఎనిమిది దశాబ్దాల కాలంగా అన్నంపేట గ్రామంలో దళితులు, ఇతర పేద కుటుంబాల 30 మంది రైతులు సుమారు 30 ఎకరాల భూమిని సాగు చేస్తున్నారన్నారు. ఈ భూములపై తమ కుటుంబాలను పోషిస్తూ జీవనం సాగిస్తున్నారన్నారు. అయితే దశాబ్దాల కాలం తర్వాత అగ్రకులానికి చెందిన ఓ పెత్తందారు ఇటీవల ఈ భూములు తనవని దౌర్జన్యంగా ఈ భూముల్లో స్తంభాలను పాతించడమే కాకుండా దున్నుతున్నాడన్నారు. రాజకీయ పలుకుబడితో దళితులు, పేదలకు చెందిన భూములను లాక్కోవాలని చూస్తే తాము సహించబోమని హెచ్చరించారు. ఇప్పటికైనా పెత్తందారు పేదలు, దళితులకు చెందిన భూములను తక్షణమే విడిచి పెట్టాలని, లేనిపక్షంలో సంఘం ద్వారా పోరాటానికైనా సిద్ధమవుతామని హెచ్చరించారు. ఈ భూములను దళితులు, పేదలు ఎనిమిది దశాబ్దాలుగా సాగు చేస్తున్నారని, పెత్తందారు ఈ భూములను కబ్జా చేస్తున్నాడని ఫిర్యాదు చేస్తే సంబంధిత రెవెన్యూ శాఖ, తహశీల్దార్, ఇతర అధికారులు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు పేదల భూములను తక్షణమే అప్పజెప్పే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు.

20న సమ్మెను జయప్రదం చేయాలి

పొందూరు : సమ్మె పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సిఐటియు నాయకులు

ప్రజాశక్తి- పొందూరు

కేంద్ర కార్మిక సంఘాల పిలుపు మేరకు ఈ నెల 20న నిర్వహించే అఖిలభారత సమ్మెను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు సిహెచ్ అమ్మన్నాయుడు పిలుపునిచ్చారు. ఆదివారం మండలంలోని రాపాక కూడలిలో సిఐటియు ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో అఖిలభారత సమ్మె పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికహక్కులు కాలరాసే లేబర్ కోడ్‌లు రద్దుచేయాలని, కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, ప్రభుత్వ రంగ సంస్థలు పరిరక్షించుకోవాలని కోరారు. కాంట్రాక్టు కార్మికులను, అంగన్వాడీ, ఆశ, మధ్యాహ్న భోజన పథకం తదితర స్కీం వర్కర్లను రెగ్యులర్ చేయాలని, పనిభారం తగ్గించాలని డిమాండ్ చేశారు. ఈ నెల 20న జరగనున్న సమ్మెను జయప్రదం చేసి కేంద్ర కార్మిక ఐక్యత చాటి చెప్పాలని కోరారు. కార్యక్రమంలో సిఐటియు మండల కన్వీనర్ పి.అప్పలనాయుడు, ఎ.రాధాకృష్ణ, బి.లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పాతపట్నం: ఈ నెల 20న చేపట్టనున్న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు కె.సూరయ్య పిలుపునిచ్చారు. పాతపట్నం సిఐటియు కార్యాలయంలో ఆదివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ లేబర్ కోడులను రద్దు చేయాలని, కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ సంస్థల ప్రయివేటీకరణ విరమణ, స్కీమ్‌ల్లో పనిచేసే వారిని కార్మికులుగా గుర్తింపు చేయాలన్నారు. కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలన్నారు. సమాన పనికి సమాన వేతనం చెల్లించాలన్నారు. లేబర్ కోడ్లను అడ్డుకోవడం ప్రధాన అంశమని, లేబర్ కోడ్లు అమలులోకి వస్తే కార్మికులందరూ బానిసత్వంలోకి నెట్టబడతారని అన్నారు. కార్యక్రమంలో కె.నాగమణి, కె.శ్రీను, జోగారావు, దుర్గారావు, నారాయణ, లోకేశ్వరరావు పాల్గొన్నారు.

సంక్షేమ విద్యా సహాయకుల ఉద్యోగుల సంఘం అధ్యక్షులుగా 'సుసాన్న'

సుసాన్న

ఆమదాలవలస: సచివాలయ సంక్షేమ, విద్యా సహాయకుల ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులుగా బడే సుసాన్నను నియమించినట్లు సంఘ గౌరవ అధ్యక్షులు, సలహాదారు కూన వెంకట సత్యనారాయణ తెలిపారు. ఆదివారం పట్టణంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్ర సంక్షేమ, విద్యా సహాయకుల ఉద్యోగుల సంఘం (రిజిస్టర్డ్ నెంబర్ 105/2025) తరపున జిల్లా అడహక్ కార్యవర్గం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సంఘ కార్యదర్శిగా దున్న వేణు గోపాలరావు, సహాయక అధ్యక్షునిగా బి.రాజశేఖరం, కోశాధికారిగా కె.జగపతిబాబు, జిల్లా ఉపాధ్యక్షులుగా కె.సంధ్య, ఎం.రమేష్‌బాబు, సంయుక్త కార్యదర్శులుగా వి.షణ్ముఖరావు, వి.ఉపేంద్ర, టి.నరేంద్ర కుమార్, కార్యనిర్వహణ కార్యదర్శులుగా మహమ్మద్ అజీద్, సుధీర్ పాణిగ్రాహి, జిల్లా ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా బి.పోలినాయుడు, పి.శంకరరావు, కె.అభిరామ్‌ను నియమించినట్లు వెంకట సత్యనారాయణ తెలిపారు. రాష్ట్రంలో ఉన్న సంక్షేమ, విద్యా సహాయకుల విషయంలో పదోన్నతుల కోసం న్యాయం జరిగేలా సీనియర్ అసిస్టెంట్ పే స్కేల్‌తో తక్షణమే ప్రభుత్వానికి నివేదిక ఇచ్చేలా సాంఘిక సంక్షేమ శాఖ చొరవ తీసుకోవాలని కోరారు. ఉద్యోగులందరి ఉద్యోగ క్యాడర్‌ను జూనియర్ అసిస్టెంట్‌గా సర్వీస్ నిబంధనలు మార్చాలని, ఉద్యోగులందరికీ విద్యాశాఖలో అవకాశాలు కల్పించేలా తగు చర్యలు తీసుకోవాలని కార్యవర్గం తీర్మానించినట్లు తెలిపారు. జిల్లాలో ఉద్యోగుల సీనియారిటీ లిస్ట్ తక్షణమే విడుదల చేయాలని కోరుతున్నామని, ఉద్యోగుల సంక్షేమమే అజెండాగా ముందుకు సాగాలని జిల్లా కార్యవర్గం తీర్మానించినట్లు తెలిపారు.

జాతీయ సమైక్యతకు పూర్వ విద్యార్థుల కృషి

మాట్లాడుతున్న వేణుగోపాల్

శ్రీకాకుళం: జాతీయ సమైక్యతకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని జెడ్‌పిహెచ్‌ఎస్ గార 1988 పదో తరగతి విద్యార్థులు పిలుపునిచ్చారు. పూర్వ విద్యార్థుల కమిటీ ప్రతినిధి కొంక్యాన వేణుగోపాల్ అధ్యక్షతన ఆత్మీయ సమ్మేళనం ఆదివారం జరిగింది. తహశీల్దార్ చక్రవర్తి, విశ్రాంత ఉపాధ్యాయులు బోర వాసుదేవరావు, బి.ఎం.ఎస్.పట్నాయక్, మాధవరావు, చిట్టి గోవిందరావు, మాణిక్యాలరావు, సింగుపురం హైస్కూల్ హెచ్ఎం ఎం.భారతి, ప్రముఖ మెజీషియన్ బి.శ్రీనివాసరాజు ప్రధాన వక్తలుగా హాజరై మాట్లాడారు. శ్రీనివాసరాజు ఇంద్రజాల ప్రదర్శన ఆహుతులను అలరించింది. పహల్గాం ఘటనలో, భారత్-పాక్ యుద్ధంలో మృతి చెందిన భారతీయులు, మరణించిన ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థుల్లో మృతి చెందిన వారికి నివాళ్లర్పించారు. భారతీయ సైన్యంలో పనిచేస్తున్న పూర్వ విద్యార్థులు కె.కారునాయుడు, ఎం.జనార్ధన్, ఎ. రమేష్ బాబు, కె. రామన్న, పూర్వపు ఉపాధ్యాయులు బోర వాసుదేవరావు, మాణిక్యాలరావు, మాధవరావు, చిట్టి గోవిందం, బి.ఎం.ఎస్.పట్నాయక్‌లను సత్కరించారు. కార్యక్రమంలో నిర్వాహకులు మార్పు మన్మథ, కె.శాంతారావు, డి.వి.కొండలరావు, గదిలి రమణ, వల్లంశెట్టి వెంకటరావు, సి.హెచ్. ఆనందరావు, వెలమల గోవింద, యతిరాజు సంజయ్, పూర్వపు విద్యార్థులు అప్పలనాయుడు, వైశ్యరాజు వాసు తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శమూర్తికి అశ్రునివాళి

ప్రజాశక్తి- కవిటి

సచింతామణి ట్రస్టు (హైదరాబాద్) వ్యవస్థాపకులు ఇందిరాదేవి భర్త, విశ్రాంత ప్రభుత్వ ఉపాధ్యాయుడు ఎన్.రామకృష్ణ మాస్టారు ఆదర్శనీయులని వక్తలు అన్నారు. 1980 నుంచి 1985 వరకు కవిటి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గణిత ఉపాధ్యాయునిగా పనిచేసిన రామకృష్ణ మాస్టారు ఇటీవల మృతి చెందారు. దీంతో మాస్టారు శిష్యులు, చింతామణి ట్రస్టు సభ్యులు ఆదివారం పాఠశాల ఆవరణలో సంతాప సభ నిర్వహించారు. ముందుగా రామకృష్ణ మాస్టారు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. అనంతరం ఆయన శిష్యులు మాట్లాడుతూ రామకృష్ణ మాస్టారు వద్ద చదువుకున్న ఎంతో మంది విద్యార్థులు ఉన్నత స్థానాల్లో ఉన్నారని అన్నారు. చదువుతోపాటు సంస్కారం, అంకితభావం, సామాజిక సేవ ఆయన తమకు నేర్పిన విలువైన లక్షణాలని అన్నారు. ముఖ్యంగా తాను పనిచేసిన ప్రాంతానికి మంచి చేయాలనే సంకల్పం నుంచి ఏర్పడిందే చింతామణి ట్రస్టు అని అన్నారు. మాస్టారు సతీమణి ఇందిరాదేవి, కుమారుడు చింతామణి కుమార్ కవిటి మండలంలో పేద విద్యార్థుల చదువుతోపాటు చింతామణి ఆలయ అభివద్ధి కోసం సుమారు కోటి రూపాయలు వెచ్చించడం వారి నిస్వార్థమైన దాతృత్వానికి, ఆదర్శ భావాలకు నిదర్శనమని కొనియాడారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ పూడి లక్ష్మణరావు, ప్రొఫెసర్ దూడ విష్ణుమూర్తి, నర్తు నరేంద్ర, అళగిరి శేఖర్, ఆరంగి మధు, ఆరింగి కృష్ణారావు, ఆరంగి త్రివిక్రమరావు, పాండవ చంద్రశేఖర్, బివి రాంబాబు, బల్లెడ బాబూరావు, నెయ్యల విశ్వనాథం, బెందాళం మల్లేశ్వరరావు, బెందాళం జానకిరావు, మొగిలిపురి కృష్ణారావు, బార్ల కృష్ణారావు, తెప్పల మోహనరావు, బి.భాస్కరరావు పాల్గొన్నారు.

నివాళులర్పిస్తున్న పూర్వ విద్యార్థులు, ట్రస్టు సభ్యులు

ప్రమాదానికి గురైన లారీ, (ఇన్‌సెట్‌లో) గాయపడిన క్లీనర్

రోడ్డు ప్రమాదంలో క్లీనర్‌కు గాయాలు

ప్రజాశక్తి- రణస్థలం

జె.ఆర్.పురం పోలీస్‌స్టేషన్ పరిధిలోని 16వ నంబర్ జాతీయ రహదారి పాత పెట్రోల్ బంక్ ఎదురుగా ఆదివారం తెల్లవారు జామున జరిగిన రోడ్డు ప్రమాదంలో లారీ క్లీనర్ తీవ్రంగా గాయపడ్డాడు. వివరాల్లోనికి వెళ్తే... శ్రీకాకుళం నుంచి విశాఖపట్నం వైపు వెళ్తున్న లారీని వెనుక నుంచి వస్తున్న మరో లారీ ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగింది. విషయం తెలుసుకున్న స్థానిక పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని గాయపడిన లారీ క్లీనర్‌ను శ్రీకాకుళం సర్వజన ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఎస్.చిరంజీవి తెలిపారు.

డివైడర్‌ను ఢీకొన్న ఆటో, (ఇన్‌సెట్‌లో) గాయపడ్డ ఆటో డ్రైవర్

డివైడర్‌ను ఢీకొన్న ఆటో

ప్రజాశక్తి- లావేరు

పూటుగా మద్యం సేవించి ఆ మత్తులో ఆటోను జాతీయ రహదారిపై నడుపుతూ డివైడర్‌ను ఢీకొన్న ఘటన మండలంలో చోటుచేసుకుంది. విజయనగరం జిల్లా చీపురుపల్లి మండలం పేర్పు గ్రామానికి చెందిన ఎలకల అప్పల నాయుడు ఆదివారం సాయంత్రం మద్యం మత్తులో ఆటోను నడుపుకుంటూ రణస్థలం నుంచి సుభద్రాపురం వైపు వస్తుండగా తాళ్లవలస గ్రామ సమీపంలో డివైడర్‌ను ఢీకొని అవతలవైపు రహదారిపైకి ఎక్కిపోవడంతో అప్పలనాయుడు తలకు, చేతులకు తీవ్రంగా గాయాలయ్యాయి. ఆ సమయంలో అదృష్ట వశాత్తు ఇతర వాహనాలు రాకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. ఆటోలో ప్రయాణికులు లేకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. గాయపడ్డ డ్రైవర్‌ను స్థానికులు 108లో ఎక్కమంటే ఎక్కడానికి నిరాకరించి స్థానికులు, 108 సిబ్బందితో వాదనకి దిగాడు. అనంతరం స్థానికులు గట్టిగా మందలించి 108 వాహనం ఎక్కించగా రణస్థలం సిహెచ్‌సికి తరలించారు. లావేరు పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు.

టిడిపి నాయకులు రాంబాబు మృతి

ప్రజాశక్తి- పోలాకి

టిడిపి నాయకులు, పోలాకి మాజీ సర్పంచ్ ప్రతినిధి లూకాలపు రాంబాబు ఆదివారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి చేరుకుని రాంబాబు పార్థవదేహానికి పూలమాలలు వేసి నివాళర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను ఓదార్చి మనోధైర్యం కల్పించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. రాంబాబు మృతి టిడిపికి తీరని లోటని అన్నారు. అటువంటి వ్యక్తి మన మధ్య లేకుండాపోవడం జీర్ణించుకోలేని విషయమని విచారం వ్యక్తం చేశారు. రాంబాబు అంతిమయాత్రలో పాల్గొన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు బగ్గు సునీల్, డోల జగన్, ఎచ్చెర్ల మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్, సర్పంచ్‌లు, ఎంపిటిసిలు పాల్గొన్నారు.

రక్తదానం చేస్తున్న ఎమ్మెల్యే శంకర్

ఎమ్మెల్యే శంకర్ రక్తదానం

ప్రజాశక్తి- శ్రీకాకుళం

నగరంలోని పెద్దపాడు రోడ్డులో ఉన్న ఆర్ట్ ఆఫ్ లివింగ్ సెంటర్‌లో ఎమ్మెల్యే గొండు శంకర్ పాల్గొని రక్తదానం చేశారు. వ్యవస్థాపకులు రవిశంకర్ జన్మదినాన్ని పురస్కరించుకుని ఆదివారం సెంటర్‌లో లాంగ్ సుదర్శన క్రియ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆర్ట్ ఆఫ్ లివింగ్ వాలంటీర్స్ పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ శాస్త్ర సాంకేతిక రంగాలతో పాటు సాంస్కృతిక రంగాలు వృద్ధిలోకి రావాలన్నారు. కార్యక్రమంలో ప్రముఖ వైద్యులు డాక్టర్ కె.అమ్మన్నాయుడు, సభ్యులు పాల్గొన్నారు.

సన్మానం అందుకుంటున్న మహ్మద్ రఫీ (ఈవేమన)

ఈవేమనకు 'అక్షరతేజం' బిరుదు

రణస్థలం: ఐఎస్ఒ గుర్తింపు పొందిన అంతర్జాతీయ సాహిత్య సాంస్కృతిక సేవాసంస్థ శ్రీశ్రీ కళా వేదిక సిఇఒ కళారత్న డాక్టర్ కత్తిమండ ప్రతాప్ సారథ్యంలో శ్రీశ్రీ కళావేదిక జాతీయ కన్వీనర్ కొల్లి రమావతి, ఈశ్వరీ భూషణం, పార్థసారథి ఆధ్వర్యంలో కవులకు, కళాకారులకు తెలుగు భాష, సాహిత్యాన్ని ప్రోత్సహిస్తూ ఏలూరులో నిర్విధికంగా 48 గంటలు వరల్డ్ రికార్డ్ కార్యక్రమం మహాలక్ష్మి గోపాల కళ్యాణ మండపంలో ఆదివారం నిర్వహించారు. ఈ తెలుగు సాహితీ సంబరాలకు ఆహ్వానం అందుకున్న శ్రీశ్రీ కళావేదిక ఉత్తరాంధ్ర అధ్యక్షుడు, ప్రముఖ కవి మహ్మద్ రఫీ (ఈవేమన)కు అక్షర తేజం బిరుదుతో ఘనంగా సన్మానం జరిగింది.

కొసమాలలో రచ్చబండ నిర్మాణం

మెళియాపుట్టి : మండలంలోని కోసమాలకు చెందిన టిడిపి సీనియర్ నాయకులు బొచ్చు ప్రసాదరావు గ్రామంలోని ఎస్‌సి వీధికి రూ.90 వేలు తన సొంత నిధులతో రచ్చబండ ఏర్పాటు చేశారు. గ్రామంలో రెండు సిసి ఫుటేజ్‌లు ఏర్పాటు చేశారు. అలాగే గ్రామంలోని యువకులకు క్రీడాకిట్లను అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామానికి తన వంతు సహకారాన్ని అందిస్తున్నట్లు తెలిపారు.

రచ్చబండను నిర్మించిన ప్రసాద్

టిడిపి ఏజెంట్లుగా పోలీసులు

మాట్లాడుతున్న ఈశ్వరరావు

ఇంటలెక్చువల్ ఫోరం అధ్యక్షుడు ఈశ్వరరావు

ప్రజాశక్తి- ఆమదాలవలస

మాజీ మంత్రి, బిసి సామాజిక తరగతికి చెందిన విడదల రజినిపై శనివారం చిలకలూరిపేట రూరల్ సిఐ సుబ్బనాయుడు అనుచితంగా ప్రవర్తించిన తీరును జిల్లా ఇంటలెక్చువల్ ఫోరం తీవ్రంగా ఖండిస్తుందని జిల్లా ఇంటలెక్చువల్ ఫోరం అధ్యక్షుడు కొవ్వల ఈశ్వరరావు అన్నారు. ఆదివారం పట్టణంలోని బొడ్డేపల్లిపేట వైసిపి కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ఒక మహిళా నాయకులపై అత్యంత దుర్మార్గంగా వ్యవహరించడం తగదని, ఒక మహిళగా తనను అవమానించడమే కాకుండా, రాజకీయ వేధింపులకు గురిచేసే ఒక ప్రయత్నంగా భావిస్తున్నామన్నారు. ఇది అరెస్ట్ కాదని, ఇది దళితుల ఆత్మగౌరవంపై దాడి అని అన్నారు. గుంటూరు జిల్లా కంతేరులో ఎంపిటిసిగా పనిచేస్తున్న వైసిపి దళిత మహిళ కల్పనను రాత్రి 3 గంటల సమయంలో పోలీసులు దౌర్జన్యంగా అరెస్ట్ చేసిన ఘటన దుర్మార్గమని దుయ్యబట్టారు. పోలీసులు తమ వృత్తి ధర్మాన్ని మరచి అధికార పార్టీకి గులాంగిరి చేస్తున్నారనటానికి ఇది ఒక ప్రత్యక్ష ఉదాహరణగా చెప్పవచ్చునని అన్నారు. టిడిపి నాయకుల ఒత్తిడికిలోనై పోలీసుశాఖ వ్యవహరిస్తున్న తీరు చేదు వాస్తవాలను బయట పెడుతున్నాయన్నారు. ప్రజాస్వామ్య విలువలు, మహిళల రక్షణ, సామాజిక న్యాయం అన్ని ఇప్పుడు ప్రశ్నార్థకంగా మారుతున్నాయన్నారు. శాసనబద్ధంగా ఎన్నికైన నాయకులను బెదిరించడం, వివిధ సామాజిక తరగతుల నాయకులను అవమానించడం, మహిళలను అర్ధరాత్రి లాక్కెళ్లడం పోలీస్‌ల విధులు కాదని, ఇవి రాజకీయ బానిసత్వపు చిహ్నాలని అన్నారు. జిల్లా ఇంటెలెక్చువల్ ఫోరమ్ ఈ విధమైన దురాచారాలను ఖండిస్తూ, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని, హ్యూమన్ రైట్స్ కమిషన్‌ను కోరుతుందన్నారు. సమావేశంలో నియోజకవర్గ డాక్టర్స్ సెల్ అధ్యక్షులు దానేటి రామ్మోహన్, తిర్లంగి గోవిందరావు, జిల్లాలోని అన్ని నియోజకవర్గాల ఇంటలెక్చువల్ ఫోరం అధ్యక్షులు పాల్గొన్నారు.

కలుసుకున్న పూర్వ విద్యార్థులు

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

ప్రజాశక్తి- పలాస

మండలంలోని చినబాడాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2002-03లో పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం ఆదివారం నిర్వహించారు. ముందుగా పాకిస్తాన్ ఉగ్రవాదుల దాడిలో వీరమరణం పొందిన జవాన్లకు జోహార్లు అర్పించారు. వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. అలాగే తమతో పాటు చదువున్న ఆరుగు స్నేహితులు చనిపోవడంతో వారికి సంతాపం తెలియజేశారు. అలాగే విద్యా బుద్ధులు నేర్పిన గురువులకు దుశ్శాలువ కప్పి సన్మానించారు. 22 ఏళ్ల తర్వాత కలిసిన పూర్వ విద్యార్థులు ఆప్యాయంగా ఒకరినొకరు పలకరించుకొన్నారు. ఆనాటి జ్ఞాపకాలను పంచుకున్నారు. అనంతరం ఆట, పాటలతో సందడి చేశారు. అనంతరం చదువుకున్న పాఠశాల అభివృద్ధికి రూ.50 వేలు వితరణగా సిబ్బందికి అందజేశారు.

ఇచ్ఛాపురం : కుర్చీ ఆట ఆడుతున్న తల్లులు

ఘనంగా మదర్స్ డే

రణస్థలం రూరల్: మనకు జీవితాన్ని, ప్రేమను, సంరక్షణను ప్రసాదించిన అద్భుతమైన మహిళ అమ్మ .. అమ్మని మించిన దైవం మరొకటి లేదని ఎమ్మెల్యే ఎన్.ఈశ్వరరావు అన్నారు. మాతృ దినోత్సవం సందర్భంగా ఆదివారం ఆయన క్యాంపు కార్యాలయంలో తన మాతృమూర్తి బంటుపల్లి మాజీ సర్పంచ్ నడుకుదిటి మహాలక్ష్మికి పాదాభివందనం చేసి ఆశీస్సులు పొందారు. కార్యక్రమంలో సర్పంచ్‌ల సంఘం జిల్లా అధ్యక్షులు పిన్నింటి భానోజీనాయుడు, కూటమి నాయకులు దన్నాన సత్తిబాబు, లక్ష్మణరావు, ముంగం శ్రీనివాసరావు, టి. అప్పల రాజు, జేని లక్షణ, టి.అప్పారావు, తిరుమరెడ్డి, వెంకటేష్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం : మండలంలోని ఈదుపురంలో హంగిరి బెహరా ఆధ్వర్యాన మదర్స్ డే వేడుకలు ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా తల్లులతో క్రీడలు నిర్వహించారు. ఆటా, పాటా, వివిధ రకరాల పోటీల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో మత్స్యకార మహిళలు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత శిఖరాలు అధిరోహించాలి

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

విద్యార్థులు మంచి భవిష్యత్ కోసం ఉన్నత లక్ష్యాలు నిర్దేశించుకుని వాటి సాధనకు నిరంతరం కృషి చేయాలని ఉద్దానం అభ్యుదయ సేవా సమితి అధ్యక్షులు తమాడ లక్ష్మణరావు అన్నారు. మండలంలోని కొమరల్తాడలో జనసేన గ్రామ అధ్యక్షుడు చింత దానేష్ ఆధ్వర్యాన నిర్వహించిన ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ఆదివారం సన్మానించారు. ఈ ఏడాది ఇంటర్మీడియట్‌లో ప్రథమ, ద్వితీయ, పదో తరగతిలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో మార్కులు వచ్చిన విద్యార్థులు టెంక యామిని, మండల ప్రవీణ్, లోట్ల త్రివేణి, దూగాన నిఖిల్, బచ్చల దివ్య, కొంకి సిరివల్లికు చిరు సన్మానం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థుల ప్రతిభను ప్రోత్సహించడం ద్వారా వారు ఉన్నత శిఖరాలను చేరుకుంటారని అన్నారు. విద్యార్థులు ఇదే స్ఫూర్తితో క్రమశిక్షణ కలిగి మంచి పౌరులుగా ఎదగాలన్నారు. కార్యక్రమంలో జనసేన నాయకులు చింత మోహనరావు, తామాడ లక్ష్మణరావు, మాగుబరి బాబూరావు, మండల మహేష్, మండల లక్ష్మణ్, నీలయ్య, బొడ్డు రవణ, చింత తరుణ్, టెంక వీరాస్వామి పాల్గొన్నారు.

విద్యార్థులను సన్మానిస్తున్న నాయకులు

పెద్ద బాలశిక్ష చదవాలి

ప్రజాశక్తి- లావేరు

ప్రాథమిక స్థాయి నుంచే ప్రతి విద్యార్థి పెద్ద బాలశిక్ష కోసం తెలుసుకోవాలని రిసోర్స్ పర్సన్ లంకలపల్లి సత్య అన్నారు. వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా స్థానిక శాఖా గ్రంథాలయంలో ఆదివారం విద్యార్థులకు ఆమె పెద్ద బాలశిక్ష కోసం తెలియజేశారు. బ్రిటిష్ వారు భారతదేశాన్ని పరిపాలించే కాలంలో పాఠశాలల్లో పిల్లలకు పెద బాలశిక్ష సిలబస్‌గా ఉండేదని, విద్యార్థులు మొట్టమొదట తమ విద్యాభ్యాసాన్ని పెద బాలశిక్షతోనే ప్రారంభించారని ఆమె అన్నారు. వేసవి విజ్ఞాన శిబిరాలను పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి మురపాక శ్రీనివాసరావు, సహాయకుడు టి.వీరభద్రుడు తదితరులు పాల్గొన్నారు.

నందిగాం : స్థానిక శాఖాగ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిక్షణ శిబిరంలో భాగంగా ఆదివారం పుస్తకం చదవడం మాకిష్టం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రంథాలయ అధికారి కిరణ్‌కుమార్ మాట్లాడుతూ మేధాశక్తిని గ్రంథాలయాలు విజ్ఞాన బాండాగారాలని, వాటిని వినియోగించుకుని నవ సమాజ నిర్మాణానికి పునాదులుగా ఎదగాలని ఆకాంక్షించారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడారు.

పెద్ద బాలశిక్ష కోసం వివరిస్తున్న రిసోర్స్‌పర్సన్ సత్య

విద్యార్థులకు ప్రోత్సాహకాలు

ప్రజాశక్తి- కవిటి

తమ సామాజిక తరగతిలో ప్రతిభ కలిగిన నిరుపేద విద్యార్థులకు చేయూత అందించడమే చింతామణి సొండి సంక్షేమ సంఘం లక్ష్యమని అధ్యక్షుడు పాండవ రామారావు తెలిపారు. చింతామణి సొండి సంక్షేమ సంఘం సర్వజన సమావేశం రాజపురంలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా 2024-25 విద్యా సంవత్సరంలో ఇంటర్మీడియట్‌లో మంచి మార్కులు సాధించిన సాహుకారి సుధీర్, పాండవ శ్రుతి, పాండవ సాయి, మొగిలిపురి భరద్వాజ్, శ్రియా చౌదరి, పదో తరగతిలో ప్రతిభ కనబరిచిన లాభాల సిరి, నీలగిరి నితిన్, సున్నాముట్టి చందు, నెమలిపురి నవ్యశ్రీ, లాభాల మహేష్, మొగిలిపురి మనోజ్, పాండవ నిఖిల్, షాహుకారి కిషోర్‌లను సత్కరించారు. కార్యక్రమంలో చింతామణి సొండి సంక్షేమ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

నవధాన్యాల సాగుపై దృష్టి సారించాలి

లావేరు: నవధాన్యాల సాగుపై రైతులు దృష్టి సారించాలని తద్వారా భూమి సారవంతంగా తయారవుతుందని ప్రకృతి వ్యవసాయ అధికారి అప్పారావు అన్నారు. ఆదివారం అదపాక, బెజ్జిపురం గ్రామాల్లో గ్రామ సంఘ సమావేశం నిర్వహించారు. ఖరీఫ్ వ్యవసాయ ప్రణాళికపై వివరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఖరీఫ్ లో ఏయే పంటలు వేయాలి, ఆ పంటల వలన లాభాలను వివరించారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించి రైతులను సన్మానించారు. కార్యక్రమంలో రైతులు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

ఎచ్చెర్ల: మండల పరిధిలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది కేశవరావుపేటలో ప్రకృతి వ్యవసాయం, ఖరీఫ్ యాక్షన్ ప్లాన్‌పై అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో మాస్టర్ ట్రైనర్ లక్ష్మునాయుడు, సర్పంచ్ భాస్కరరావు, ఎంపిటిసి జగదీశ్వరరావు, రైతు సంఘం నాయకులు పొందూరు చంద్రరావు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది వెంకటరమణ, బాబూరావు, రాజేశ్వరి పాల్గొన్నారు.

కవిటి: నవధాన్యాలతో నేలతల్లి సాగుచేసి మంచి ఫలితాలు సాధించాలని ప్రకృతి వ్యవసాయం ఎన్ఎఫ్ఎ గోవింద్, ఎంటి దుర్గాప్రసాద్, డిఎంఎంటి తులసయ్య అన్నారు. మండలంలోని గొర్లెపాడులో రైతులకు నవధాన్యాల సాగుపై ఆదివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నవధాన్యాలు సాగుతో భూమి గుల్లబారి వానపాములు వద్ధిచెంది సేంద్రీయ కర్బనం పెరుగుతుందని తెలిపారు. అదే సమయంలో నేలలో నీటిని నిల్వఉంచే సామర్థ్యం పెరగడంతో పాటు నేల కోతకు గురికాకుండా మొక్కకు కావాల్సిన 59 పోషకాలు లభిస్తాయని తెలిపారు. నవ ధాన్యాలు వేసిన 45 రోజుల నుంచి 50 రోజుల లోపల భూమిలో కలియదున్నాలని, లేదంటే పశుగ్రాసంగా కూడా వాడుకోవచ్చని సూచించారు. అనంతరం నేలతల్లి బాగు కార్యక్రమంలో భాగంగా 9 నుంచి 32 రకాల విత్తనాలను ఎకరానికి 12 కేజీలు చొప్పున కిట్లు రూపంలో రైతులకు అందజేశారు. అలాగే ఎటిఎం మోడల్ పద్ధతిలో అన్ని రకాల కూరగాయలు, ఆకుకూరలు సాగుచేస్తున్న ఉత్తమ రైతులు, పొందిర్ల దాసు, రావడ. జ్యోతిలను సత్కరించారు. కార్యక్రమంలో కుమారి, చిట్టిబాబు, కామరాజ్, శ్రీదేవి, సంతోషి, రైతులు పాల్గొన్నారు.